# కుందేటి కొమ్ము

ఎప్పుడో అయిదో క్లాసులో చదువుకన్నాం కలిసి. ఇప్పుడు యెవరేం చేస్తున్నామో ఒకళ్ళనడిగి ఒకళ్ళం తెలుసుకుంటే గాని తెలీదు.

ఇందులో నాప్రమేయం యేమీలేదు. అలవాటు ప్రకారం సిమెంటు రోడ్డుమీద ఓ వారగా వెళుతున్నాను, బుర్రవంచుకుని – యేవేవో ఆలోచించుకొంటూ, మర్చిపోయిన అమూల్యవిషయాలు నెమరుకు తెచ్చుకొంటూ.

వెనకనుంచి ఎవరిదో చెయ్యి వచ్చి మీద పడింది. ఎవరేనా పొరపాటున పరధ్యానంలో వేసుంటారేమోనని అంత పట్టింపుగా వెనక్కి తిరిగి చూళ్ళేదు – ఎంతసేపటికీ చెయ్యి విడదు. బలవంతాన వెనక్కి తిరగ్గాయెన్నడో ఎరిగిన ముఖం. కాని గుర్తురాదు – తెలీదు యెవరయిందీనీ.

నా సంధిగ్ధం గ్రహించాడు. వెంటనే అన్నాడు; ''అవున్లే మర్చిపోయుంటావు, ఇప్పటిమాటా మరి? పన్నేండళ్ళయింది మనం విడిపోయి. నాకంటే అదేపని గనక – నిన్ను గుర్తు పట్టాను – ఏమీ అనుకోన్లే పద!''

గుర్తురాదు; కాని మెకానికల్‌గా ఆ మనిషి తీసికెళ్ళినట్టే నడిచాను. మనస్సులో ఒకటే బెంగ; గుర్తు రాదేమా అని కోపం, అవతలి మనిషి యేమనుకుంటాడోనని భయం, కాని లాభంలేదు.

కాఫీ తాగబోతూ అతనే అన్నాడు: ''ఇంకా గుర్తు రాలేదు కదూ? చెప్పెయ్యనా? లేక ఇంకా టైం యివ్వమంటావా?''

ఏ మనేందుకూ తోచదు. చొరవ చేసుకు మాట్లాడే స్నేహితుడి పేరు గుర్తు రానందుకు సిగ్గు. నీరసంగా నవ్వాను.

''సుబ్బారావుని'' అన్నాడు.

ఎవరు సుబ్బారావు? ఎంతమంది లేరు సుబ్బారావులు? కో అంటే కోటిమంది సుబ్బారావులు పలికే యీ ఆంధ్రదేశంలో ఈ సుబ్బరావు ఎవరని ''అయిడెంటిఫై'' చెయ్యను? గుర్తున్నంతమేరకూ సుబ్బారావులంతా మనసులో మెదిలారు. మాయింటి సొంతదారుడూ, ఖాతాకొట్టు ఆసామీ, అవతలవీధిలో ఎవరినో లేవదీసుకు వొచ్చి కాపురం వుంటున్న పెద్ద మనిషీ, విజయనగరంలో స్కూలు మాష్టారు ఉద్యోగం చేస్తూ అకస్మాత్తుగా గుండె ఆగి చనిపోయిన పుణ్యపురుషుడూ, మా బావమరిది పింతల్లి నాలుగోకొడుకు – ఉహు లాభంలేదు. ఈ మనిషి ఆ మనుషుల్లోవాడు కాదు.

కోపం వస్తుందేమో అనుకున్నాను, శాపం పెడతాడన్న భయం లేదుగాని ఎదుటి వాడికి క్షుద్రలక్షణాలు యేర్పడేందుకు కారణం యేర్పడేందుకు కారణం ఎందుకవాలని. నవ్వుతూనే వున్నాడు యింతసేపూ. ఆ నవ్వు నా అజ్ఞానానికి పరిహాసంగా కాదనుకుంటాను. కేవలం తమాషాగా.

అసహాయస్థితి గ్రహించాడు. పాపం అనుకున్నాడు కావును, ముందడుగు వేశాడు! ''ఒక్కటే యేడాది. ఇద్దరం కలిసి మెలిసి తిరుగుతూ ఐదో క్లాసు చదివేవాళ్ళం, మనిద్దరి స్నేహానికీ ఎందరో అసూయ!'' ఇంకా చెప్పక్కరలేదు, సుబ్బారావు గుర్తుకు వచ్చాడు. కాని ఎందుకింతసేపూ గుర్తుకు రాలేదు? జరిగిపోయిన సంగతుల్ని గురించి ఒకటే గుంజాటన. ఎట్లా గుర్తుంటుంది?

ఎన్నాళ్ళు బతుకుతామో తెలీనివాళ్ళం, బ్రతికే నాలుగురోజులైనా యే నీడని వుంటామో తెలియని వాళ్ళం, ముందు క్షణం యేం మూడుతుందో తెలుసుకోలేనివాళ్ళం, ఆత్మతృప్తికోసం ఊరికే అంచనాలు వేసుకునేవాళ్ళం, మనం యేం చెయ్యగలం? ఎన్నని గుర్తు పెట్టుకోగలం? జీవితంలో అనేక విషయాలకు సామ్యాలు, పోలికలు – భ్రమని కలిగించేందుకు?

కాని సంతోషించాను. అయిదో క్లాసులోని నా మిత్రుడు నన్నీస్థితిలో గుర్తుపట్టగలిగినందుకు నేను గుర్తుపట్టలేకపోవటం శోచనీయమే ఐనా గర్వపడుతున్నాను.

సుబ్బారావు ముభావి కాదు. తల్చుకున్నదంతా నాలుగుముక్కల్లో దబాదబా వాగేస్తాడు. "ఏమిటీ వాలకం? ఇక్కడ యెన్నాళ్ళబట్టీ వుంటున్నావు? ఏం చేస్తున్నావు?..." ఇట్లానే బాహ్యజీవితానికి సంబంధించిన అముఖ్యిత ప్రశ్నలు యెన్నో వేశాడు. జవాబుకోసం నన్ను నేనే ఒకసారి పరికించుకున్నాను. చొక్కా బాగానే ఉందనిపిస్తోంది. పోతే కొద్దిగా నలిగిపోయింది. జుట్టు రేగి వుండటం తథ్యం. విసుగుతోనూ ఆలోచనలతోనూ ముఖం గంభీరమై కొత్తగా చూచేవాడికి కోపం వచ్చేట్టు ఉండొచ్చును. ముఖాన్ని బట్టి భావాలు చదువుతారా? చదవగలరా యెవరైనా? అట్లాగయితే హృదయాలు విప్పి చదవచ్చుగా.

"జవాబు చెప్పవేం? ఏం చేస్తున్నావు?"

చెప్పాను. నిర్జీవంగా చెప్పాను. సుబ్బారావు పులకరించాడు. నేనింత ఘనపదవిని అధిష్ఠించినందుకు కంగ్రాచ్యులేషన్స్ చెబుతూ పోతున్నాడు. కాని నా బాధ, అంతర్వాణి సంఘర్షణ సుబ్బరావుకి ఎందుకర్థంకాదు? కనీసం యెందుక తను ఊహించలేడు?

ఇంటికి తీసుకొచ్చాను. అడక్కముందే చెప్పేశాడు తనకి పెళ్ళయిందనీ ఇద్దరుపిల్లలనీ కుటుంబం అక్కడే వుందనీ . తను మత్రమే వొచ్చాట్ట. ఉద్యోగంలో చేరాక సెలవు చూచుకొని తీసుకొస్తాట్ట. మంచి యిల్లు కావాలన్నాడు. నువ్వే చూచి పెట్టాలన్నాడు. మౌనం పూర్ణాంగీకారంగానే స్వీకరిస్తాడు పాపం, తనకోసం నేనో ఇల్లు చూచి పెడతాననీ యిక తనకే బెడదా అక్కర్లేదనీ సుబ్బారావు అనుకుంటూంటాడు.

సుబ్బారావు నాకు యేమిటి? అట్లా అనుకుంటే యీ ప్రపంచంలో యెవరూ యెవరికీ యేమిటీ కారు. ఒకళ్ళ ఒకళ్ళకీ మధ్య అనుబంధాలు వుండి తీరాలి, సంబంధాలు పెరగాలి, మమకారాలు యేర్పడాలి. అప్పుడే జీవితంలో ఆనందం, ఆ మమకారం కీలు సడలితే జీవితంలో వైరాగ్యదృశ్యం - అంతా అనుకుంటున్నాను మనసులోనే. ఏదీ సుబ్బారావుతో పైకి అనే ధైర్యం చాలదు. బాల్యమిత్రుడు అనుకోవచ్చా సుబ్బరావుని? తప్పులేదు, అంతకన్నా యింకేదో యెక్కువని అనిపిస్తుంది.

నేనింతవరకూ చదివిన తరగతుల్లో యెంతమంది మిత్రుల్లేరు? వాళ్ళందరిలోకి సుబ్బారావుని నేనెక్కువగా ప్రేమిస్తున్నానా? ఎప్పుడో అయిదోక్లాసులో చదువుకున్నాం కలిసి, మధ్యలో మరిచే పోయాను. అతను గుర్తు చేస్తే నే తప్ప నెమరుకురాని నీరసస్థితిలో

వున్నాను. తీరా తెలిశాక సుబ్బారావంటే యెందుకింత ఆప్యాయం నాకు? నాకు ప్రాణంలో ప్రాణమా సుబ్బారావు?

"యే విషయాలూ మాట్లాడవేం? చెప్పేందుకు యేమీ సంగతులు లేనేలేవా యిన్నేళ్ళలోనూ? అంతగంభీరంగా యెందుకుంటావు?"...సుబ్బారావు యివేంప్రశ్నలు? ఐదో తరగతి ప్రశ్నలు వేస్తున్నాడు.

సుబ్బారావు ఊరికి వెళ్ళిన మూడురోజులూ నాకేం తోచదు. ఏమిటో వెలితి. హృదయం మరెక్కడో వున్నట్టూ విగ్రహం మాత్రం యిక్కడ వున్నట్టూ, సంవత్సరాల తరుబడి మర్చిపోయాం. కనక ఒకళ్ళ ప్రసక్తి ఒకళ్ళం లేకుండా గడపగలిగాం . తీరా మళ్ళీ కలుసుకున్నాక ఒక్కక్షణం విడిపడితే యేమిటో బెంగ. ఈ హృదయాలు ఎంత లోతో తెలీదు. ఆకాశం యెంత యెత్తో యెవరికి తెలుసు?

'నా యింటిమాట యేం చేశావు?' అంటాడు సుబ్బారావు, ఇంకా భేదాలు నువ్వొకటీ నేనొకటీ కాదు.

'నువ్వే నేనయినప్పుడు, నా యిల్లూ నీ యిల్లే; ఈ ఇల్లే మనది - వేరే చర్చ యెందుకూ?' అన్నాను.

ఒప్పుకోడు తేలిగ్గా, ఏమిటో అందుకు ప్రతికూలంగా చెబుతాడు, "నాకు మనశ్శాంతి ఉండాలంటే నువ్వీపని చేసి తీరాలి" అంటే యికనోరు మెదపలేదు.

నిజదార సుతులతో సుబ్బారావు నాయింటోనే కాపురం చెయ్యాలని నేనెందుక్కోరుకోవాలి? మనస్సులొకటైనా మనుషులు ఒకటే అవుతారా? ఇంకా ఆ నూత్న ప్రపంచంలోకి మనం వెళ్ళలేదుగా అనిపిస్తుంది.

జరిగిందానికి కారణాలు చెప్పగలం కాని జరగబోయే సంగతులు చెప్పలేం మనం!----- ఈ మాట అనుకుంటే గాని ఆత్మతృప్తి ఉండదు. ❋

(తెలుగు స్వతంత్ర)